క్లుప్తంగా

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సత్తెనపల్లి: పట్టణంలోని 11వ వార్డు వెంగళరెడ్డి నగర్‌లో జనరల్ ఫండ్స్ రూ.12.80 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం పరిశీలించారు. నిర్మాణం చేపట్టాల్సిన మరో రోడ్డును పరిశీలించి, త్వరితగతిన పనులు చేపట్టేలా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఆయనతో పాటు 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ ఉన్నారు.

నేడు కస్తలలో రీ-సర్వేపై గ్రామ సభ

అచ్చంపేట: మండలంలోని కస్తల గ్రామంలో రీ-సర్వేపై మంగళవారం సాయంత్రం 4 గంటలకు గ్రామ సభ జరుగుతుందని, అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, గ్రామ పెద్దలు, అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని పేర్కొన్నారు.

చదువు చెప్పిన బడికి సాయం



పెదకూరపాడు: తమ ఉన్నతికి దోహదపడ్డ పాఠశాలకు తమవంతు సాయం చేశారు పూర్వ విద్యార్థులు. నీటి వసతి లేక బాలికలు మరుగుదొడ్డికి వెళ్లేందుకు సిబ్బంది పడుతున్నారని తెలిసి స్పందించారు. లగడపాడు ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి సువర్ణ లక్ష్మి ఆధ్వర్యంలో అన్నమ్మ, సత్యం, లక్ష్మణ్, కోటేశ్వరరావు, చంద్రం, వెంకటరావు విద్యుత్ మోటార్, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

అమరావతి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



అమరావతి: మండల తహసీల్దార్‌గా మీసాల డానియేల్ సోమవారం పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఆయన పెదకూరపాడు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా చేస్తున్న నాగమల్లేశ్వరరావు మాచవరం మండలానికి బదిలీ అయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులోఉంటానని డానియేల్ అన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



నకరికల్లు: విద్య ప్రతి ఒక్కరినీ ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక పాతూరులోని ఎంపీపీ పాఠశాలలో చదువుల తల్లి శ్రీ సరస్వతీదేవి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణానికి సహకరించిన వారిని అభినందించి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, బొర్రా అప్పారావు, సాగి శ్రీనివాసరావు, బద్దుల నాగేశ్వరరావు, కరాలపాటి వలి, పాలాంజి, గుజ్జుల పోలు పాల్గొన్నారు.

సీపీఐ నేత యిర్మియా మృతి



సత్తెనపల్లి: సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ పోసిపోగు యిర్మీయా (63) ఆదివారం అర్ధ రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. యిర్మీయా సీపీఐ పార్టీ పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి. విద్యారంగంలో అనేకమంది విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దిన మంచి ఉపాధ్యాయుడిగా పేరు గాంచారు. మంచి చిత్రాకారుడు, బుక్ రీడర్, సాహిత్యం పట్ల మక్కువ. అనేక సంవత్సరాలుగా ట్రేడ్ యూనియన్ రంగంలో పనిచేస్తూ ఎర్రజెండా ఆశయాల సాధన కోసం కష్టపడి పని చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన దొడ్లేరు గ్రామానికి తీసుకెళ్లారు. సీపీఐ నాయకులు నరిశేటి వేణుగోపాల్, కంభాల శ్రీనివాసరావు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

యిర్మీయా మృతి తీరనిలోటు

సత్తెనపల్లి: సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి పి.యిర్మీయా ఆకస్మిక మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి, కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. సోమవారం యిర్మీయా మృతదేహానికి సీపీఎం నాయకులు నివాలులర్పించారు. పెండ్యాల మహేష్, కట్టా శివదుర్గా రావు ఉన్నారు.

పునరుద్ధరిస్తే..ప్రజోపయోగం

- నిరుపయోగంగా కొండమోడు పోలీసు అవుట్ పోస్టు
- ఆరేళ్ల నుంచి నిలిచిన సేవలు
- రద్దీ జంక్షన్‌లో కొరవడిన నిఘా, పర్యవేక్షణ
- పెరుగుతున్న ప్రమాదాలు, అసాంఘిక కార్యక్రమాలు



నిరుపయోగంగా ఉన్న పోలీసు అవుట్ పోస్టు



కొండ మోడు జంక్షన్

రాజుపాలెం: కొండమోడు జంక్షన్‌లో నిర్మించిన పోలీస్ అవుట్ పోస్టు నిరుపయోగంగా మారింది. రెండు దశాబ్దాల క్రితం అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్పీ సూచనలతో పోలీసు అధికారులు దాతల సహాయంతో సంయుక్తంగా దీనిని నిర్మించారు. కొండమోడు జంక్షన్ రద్దీగా ఉండడం, ఈ ప్రాంతంలో ముగ్గు క్వారింగ్ అక్రమంగా జరగడం, రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వసేందుకు.. ఈ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు.

ప్రజలకు ఉపయుక్తం..

ఈ అవుట్ పోస్టులో దశాబ్దం పాటు సిబ్బంది నిర్విరామంగా విధులు నిర్వహించారు. పూర్తిస్థాయి ఫర్నిచర్‌తో రాత్రింబవళ్లు పనిచేసేందుకు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను అధికారులు నియమించారు. వీరు జంక్షన్‌లో శాంతిభద్రతల పర్యవేక్షణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేవారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేవారు. చుట్టు పక్కల ఉన్న 8 గ్రామాల్లో ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నా..వెంటనే ఇక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది స్పందించేవారు. గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీయాల్సిన పనిలేకుండా అవుట్ పోస్టు సిబ్బందికి సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చేవారు. ఈ పద్ధతి ప్రజలకు కూడా చాలా ఉపయోగకరంగా మారింది.

నిలిచిన సేవలు..

ప్రజలకు చేరువులో ఉండే అవుట్ పోస్టు సేవలు ఆరేళ్ల నుంచి నిలిచిపోయాయి. సిబ్బంది ఇక్కడ విధులు నిర్వర్తించడం లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారి జంక్షన్ కావడంతో హైదరాబాద్ నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు రాత్రిళ్లు ఇక్కడ దిగి, స్వగ్రామాలకు వెళ్తుంటారు. పోలీసుల నిఘా లేకపోవడంతో ఇక్కడ రాత్రిళ్లు ప్రయాణికులు దిగాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు.

ప్రమాదాలు అరికట్టవచ్చు



కొండ మోడు జంక్షన్ నిత్యం ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉంటుంది. రాంత్రింబవళ్లు క్వారీల నుంచి అతి వేగంగా ట్రాక్టర్లు వెళ్తుంటాయి. దీంతో ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. అవుట్ పోస్టులో పోలీసు సిబ్బంది ఉంటే ప్రమాదాలను నివారించవచ్చు. గతంలో ఇక్కడే ఫిర్యాదులు తీసుకునేవారు. పోలీసు అవుట్ పోస్టును కొనసాగించాలి.


– మందా రవి, అనుపాలెం

సేవలను పునరుద్ధరిస్తాం..

అవుట్ పోస్టు సేవలను వివిధ కారణాలతో 2018 నుంచి నిలిపివేశారు. సేవల పునరుద్ధరణపై దృష్టి పెట్టాం. అక్కడ విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తున్నాం. నిఘా కోసం సీసీ కెమెరాలను ఆర్డర్ ఇచ్చాం. వీటిని ఏర్పాటు చేసి త్వరలో యథావిధిగా సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

– కె.వేణుగోపాల్, ఎస్ఐ, రాజుపాలెం

సత్తెనపల్లి మాజీ సర్పంచ్ చతుర్వేదుల వర్ధంతి



సత్తెనపల్లి: సత్తెనపల్లి మాజీ సర్పంచ్, పేదల డాక్టర్ చతుర్వేదల సీతారామశాస్త్రి అలియాస్ జండు శాస్త్రి 55వ వర్ధంతి పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గల ఆయన విగ్రహం సోమవారం నిర్వహించారు. సీతారామ శాస్త్రీ విగ్రహనికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలకు పలువురు కొనియాడారు. అనంతరం మాతృశ్రీ మొల్లమాంబ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ, టీడీపీ, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు, సీతారామ శాస్త్రీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రథయాత్ర.. విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజుపాలెం: వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కొండమోడు విద్యుత్ కార్యాలయంలో పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. సిబ్బంది పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పిడుగురాళ్ల పట్టణంలో ఆంజనేయస్వామి తిరుణాళ్ల సందర్భంగా మంగళవారం ఓవర్ బ్రిడ్జి దగ్గర ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి భారీ స్థాయిలో రథయాత్ర జరుగుతున్నందున మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 7 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు. విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ బి.నాగసురేష్ బాబు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మం



కలెక్టర్ చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న అనిల్‌కుమార్



ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్ ఎం.భవానిశంకర్



ప్రశంసా పత్రం అందుకుంటున్న తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి



ప్రశంసా పత్రం అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఏపీఎం(ఐబీ)కేతినేని సుబ్బారావు

సేవకు సత్కారం

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉత్తమ అధికారులుగా ఎంపికైన వారికి గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ గన్నోరే, ఎస్పీ శ్రీనివాసరావు తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారుల అవార్డులను ప్రదానం చేశారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులను, ఉద్యోగులను ఆయా శాఖల సిబ్బంది సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. –సత్తెనపల్లి/పెదకూరపాడు



ప్రశంసాపత్రం అందుకుంటున్న గర్నెపూడి పంచాయతీ కార్యదర్శి అంకమ్మరావు



మదర్‌థెరిస్సా ఆదరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుకా జాన్సన్



ప్రశంసా పత్రం అందుకుంటున్న డీబీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప



జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న పీఏసీఎస్ సీఈవో సాంబశివరావు



ఉత్తమ ప్రశంసాపత్రం అందుకుంటున్న తోట ఆంజనేయులు



ప్రశంసా పత్రం అందుకుంటున్న నకరికల్లు జూనియర్ అసిస్టెంట్ వి.సుబ్రహ్మణ్యప్రసాద్



ప్రశంసా పత్రం అందుకుంటున్న డీటీ జింకా శ్రీనివాసరావు



ప్రశంసా పత్రం అందుకుంటున్న క్రోసూరు ఎంపీడీవో జి.శ్రీనివాస్



ప్రశంసాపత్రం అందుకుంటున్న నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్

రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



చెరుకుంపాలెంలో భూములను పరిశీలిస్తున్న కృష్ణయ్య

అచ్చంపేట: డీకే పట్టాలు కలిగియున్న రైతుల భూములను అటవీ శాఖాధికారుల నుంచి రక్షణ కల్పించాలని ఏపీ రైతు సంఘ అధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మండలంలోని చెరుకుంపాలెంలో సుమారు 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నుంచి డీకే పట్టాలు పొందిన రైతుల భూములను సోమవారం ఆయన రైతు సంఘ నాయకులతో కలసి పరిశీలించారు. మండలంలోని తాళ్ల చెరువు రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబరు 320 నుంచి 337 వరకు ఉన్న 120 ఎకరాల భూములను 1992లో అప్పటి గుంటూరు ఆర్డీవో, జాయింట్ కలెక్టరు, అటవీ శాఖాధికారులతో జాయింట్ సర్వే చేయించి రెవెన్యూ భూమిగా నిర్ధారించడం జరిగిందన్నారు. 1993లో అప్పటి ప్రభుత్వం చెరుకుంపాలెం గ్రామానికి చెందిన 100 మందికి పైగా నిరుపేద రైతులకు ఆ భూమిని పంపిణీ చేసి డీకే పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. ఆ భూములను సర్వే చేసి ఎవరి భూములను వారికి కేటాయించి పొజిషన్ చూపించాలని, ఆన్‌లైన్ పోర్టల్ ఎక్కించి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాల్సిందిగా రైతులు అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా చేయలేదని చెప్పారు. గత రెండేళ్లుగా అటవీ శాఖాధికారులు వచ్చి ఈ భూములు మొత్తం అటవీ శాఖ కిదకు వస్తాయని, వదలి వెళ్లాలని బెదిరస్తున్నారని చెప్పారు. దీనిపై వెంటనే రెవెన్యూ, పోలీస్ అధికారులు జోక్యం చేసుకుని రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే తహిసీల్దార్, కలెక్టరు కార్యాలయాల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. గంజిమాల రవిబాబు, రావెల వెంకటేశ్వర్లు, ఆర్. హనుమంతరావు, కేకే రెడ్డి పాల్గొన్నారు.

అనుపాలెంలో పశువైద్య శిబిరం



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యాధికారి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఎం.పుల్లారెడ్డి

రాజుపాలెం: మండలంలోని అనుపాలెంలో పశు వైద్య శిబిరం సోమవారం జరిగింది. డాక్టర్ కె.నాగేశ్వరరావు పాల్గొని పశువులకు వైద్య సేవలందించారు. 18 పశువులకు సాధారణ చికిత్స, 17 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, 18 పశువులకు సూడు పరీక్షలు చేశారు. 22 పశువులకు, 42 లేగ దూడలకు 800 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేవారు. 49 మంది రైతులు సేవలు వినియోగించుకున్నారు. పశువైద్య సిబ్బంది జె.మల్లికార్జునరావు, రమ్య, ఇందు, తేజ, ఆదినారాయణ పాల్గొన్నారు.

గోళ్ళపాడులో పశు ఆరోగ్య శిబిరం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్లపాడు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం సోమవారం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి పాల్గొని వైద్య సేవలందించారు. 42 పశువులకు గర్భకోశ పరీక్షలు, 34 దూడలకు నట్టల నివారణ మందు, 432 పశువులకు నట్టల నివారణ మందు, 28 గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించినట్లు పుల్లారెడ్డి తెలిపారు.

1,631 పశువులకు చికిత్స

క్రోసూరు: హసనాబాద్, పారుపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాల్లో 1631పశువులకు, జీవాలకు చికిత్స అందజేసినట్లు మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. 51 సాధారణ, 44 గర్భకోశ చికిత్సలు, 1,536 పశువులకు నట్టల నివారణ మందు వేసినట్లు తెలిపారు. మొత్తం 1,631 పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించి, ఉచితంగా మందులు అందచేసినట్లు వెల్లడించారు.

గోవర్ధనమ్మ మృతికి భార్గవ్‌రెడ్డి నివాళి



నివాళులర్పిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: మండలంలో భృగుబండ గ్రామ సర్పంచ్ గండు పద్మావతి అత్త గోవర్ధనమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్లి గోవర్ధనమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ పద్మావతి, ఆమె భర్త సాంబశివరావు సానుభూతి తెలిపారు. గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్లం విజయ భాస్కర్‌రెడ్డి, సత్తెనపల్లి రూరల్ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, పార్టీ నాయకులు దేసుబాబు, లక్ష్మారెడ్డి, బయ్యారపు సతీష్, రాఘవ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామి

సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామి అని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన పూర్తయి సందర్భంగా.. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు తీసుకురావడం కోసం రేయింబవళ్లు చంద్రబాబు కష్టపడుతున్నారన్నారు. నాడు తెలుగు ప్రజలకు మొదటిసారి ఐటీని పరిచయం చేసి తెలుగువాడి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. నేడు మరో ఇన్నొవేషన్‌కు చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా ఎముకులను కొరికే చలిని (-6ని) సైతం లెక్క చేయకుండా రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకురావడానికి దావోస్ నడి వీధుల్లో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ పడిన శ్రమ సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు యెల్లినేడి రామస్వామి, పూజల వెంకట కోటయ్య, కోమటినేని శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు నందిగామ ఏలియా (21) సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామానికి చెందిన నందిగామ ఏలియా ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఐటీఐ చేస్తూ కొంత కాలంగా ఖాళీగా ఉంటున్నాడు. తన పుట్టిన రోజు కావడంతో గుంటూరు ఉమెన్స్ కళాశాలలో చదవుతున్న సోదరి వద్దకు మిత్రులతో కలిసి వెళ్లి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని తిరిగి ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి వస్తుండగా నందిగామ అడ్డరోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందు తూ మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు దస్తగిరి అలియాస్ దత్తు, లిలెమ్మ, సోదరుడు, సోదరి ఉన్నారు. పుట్టిన రోజు వేడుకలతో అందని లోకాలకు వెళ్ళావా అంటూ మృతుడు ఏలియా కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

• నవదిన ప్రార్థనలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175వ వజ్రోత్సవ తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక బాలవికాస్ హైస్కూల్ వద్ద నున్న నిత్య సహాయమాత మందిరం వద్ద నవదిన ప్రార్థనలు చేశారు. పేరేచర్ల విచారణ గురువులు రెవ.ఫాదర్ గంజి బాలస్వామిరెడ్డి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఫాదర్లు అగస్టీన్, చర్చి పెద్దలు, కన్యాస్త్రీలు పాల్గొన్నారు.